# ఒక్కమనిషి నవ్వడేం?

"ఈ ఉత్తరం మీది, నా సీటుకేం సంబంధం లేదు."

తలెత్తి చూసేను.

అప్పటికప్పుడే ఉత్తరాన్ని నా టేబుల్‌మీద పడేసి వెనక్కి తిరిగేడు రామ్మూర్తి.

లెటర్ తీసుకుని చదివేను. "రామ్మూర్తిగారూ"— పిల్చేను.

రామ్మూర్తి బూట్లు టకటకలాడించుకుంటూ నా దగ్గరసా వచ్చేడు. ఏఁవిటన్నట్లు నొసలు చిట్లించాడు. దట్టంగా మొహానికి పట్టించిన పౌడరు అతని నుదుట ఒకచోట చారగా ఏర్పడింది. రామ్మూర్తిని అలా చూడటం నాక్కొంచెం కష్టం కలిగిస్తుంది. దీనికి ఇంకో కారణం కూడా వుంది. అతను వస్తుతహా స్థూలకాయుడు. ప్రత్యేకించి మెడ నరాలు భుజాలమీద అటూ ఇటూ వెన్నముద్దలు నిలిపినట్లుంటాయి. అతను మొహం చిట్లించినప్పుడు ఈ వెన్న ముద్దలు పైకీ కిందికీ కదుల్తుంటే— చూడటానికి అదోలా వుంటుంది నాకు. అందుకని వెంటనే చూపులు మరల్చుకున్నాను.

"ఏఁవిటీ?" అతనడిగేడు. అడిగేడనేకంటే గద్దించాడంటేనే బాగుంటుంది.

"ఈ ఉత్తరంలో మీ సీటుకు సంబంధించిన విషయం కూడా

వుంది"—— చెప్పేను.

"చూశాను. కానీ, అది రెండో పేరాలో వుంది. ముందు మీకు సంబంధించిన సబ్జెక్టు వుంది కనుక మీరే పూర్తిగా జవాబివ్వాలి."

నా కెందుకో ఒళ్లు మండింది. "ఏం—— అలా ఎక్కడన్నా రాసిపెట్టారా?"

"అక్కర్లేదు. నే చెప్తున్నాగా, చూడండి. అదిక్కడి ఆచారం" తల బిరుసుగా సమాధానం చెప్పి వెళ్లిపోయాడు.

అతను సీట్లో కూర్చుంటూ వుండగా అతని కేసి చూసేను. చిరాగ్గా మొహం పెట్టి, ఏదో గొణుక్కుంటూ నావైపు అదోలా చూస్తున్నాడతను.

రామ్మూర్తంటే నాకిందుకే కోపం. ఎప్పుడూ చిరచిరలాడుతూ మొహం నరాలన్నీ ఉబ్బరించుకొంటూ బిగదీసుకుపోతూ వుంటాడు. అతను ఆఫీసులో చూపే 'డిస్పోజల్స్' అన్నీ ఈ బాపతే. ఆఫీసు టైమ్‌లో అతనుచేసే ముఖ్యమైన పని వేరే ఇంకొకటుంది మరి. పదో తరగతి పుస్తకాలు శ్రద్ధగా చదువుకుంటూ వుంటాడతను. అఁహాఁహఁ—— అతనా పరీక్షకేం వెళ్లటంలేదు. వారు తమ ఇరవైవ రెండవ ఏటనే (టూ ఎర్లీ యిన్ లైఫ్!) బి. ఏ. పరీక్ష పాస్ చేసి వున్నారు. ఇంటిదగ్గర రామ్మూర్తికో దుకాణం వుంది. అందులో వున్న సరుకులన్నీ 'ముడి' పదార్థాలు. వాటిని బాగుచేసి ఇంచక్కా వన్నె తెచ్చి దినపత్రికల్లో నెంబర్ల రూపేణా మెరిసి పోయేందుకు కృషి చేయటం రామ్మూర్తి 'హాబీ!' ఈ 'హాబీ' అంటే అతనికి చాలా ఇష్టంవూ, శ్రద్ధానూ. అపును మరి అసలుకంటే వడ్డీ ముఖ్యంవూ ముద్దూ కాదుటండీ!

అతనిచ్చి వెళ్ళిన లెటర్‌ని పూర్తిగా చదువుదామని తీసేను.

"సత్యం—నిన్ను మేనేజరు పిలుస్తున్నాడు". కొట్టొచ్చినట్లు చెప్పి తన సీట్లో కూర్చున్నాడు బాబ్జీ. అతని సీటు నా పక్కనే.

బాబ్జీ మొహం చూసేను. పరీక్ష హాల్లో కాపీ కొట్టూ పట్టుబడ్డ విద్యార్థి మొహంలా వుంది. "ఎందుకో" యథాలాపంగా అన్నాను.

"సోదడుగు తెలుస్తుంది" బాబ్జీ జేబులో సొపగు టక్కుమంది.

"వోరి నీకోపం తగలడ. మేనేజర్ తిట్టినంత సేపూ యస్ సర్, యస్ సర్' అంటూ నిలబడి బయటికొచ్చి వేసవికాలపు ఎండలా మిటమిటలాడ్తావేరా నా చిట్టి తండ్రీ!"

బాబ్జీకి అధికారులంటే విపరీతమైన కసి. వాళ్ళంతా సంఘ విద్రోహులనీ, ధనాంధకారులనీ, వేలవేలు ప్రజాధనాన్ని తెగతింటున్న ద్రోహులనీ ఘట్టినమ్మకం. పొట్టి సంతకం ఎక్కడ పెట్టాలో, పొడుగు సంతకం ఎక్కడ పెట్టాలో తెలీని 'బచ్చా' గాళ్ళంతా— తన లాంటి 'జీనియస్'కి 'బాస్' లౌతున్నారని కోపం. అతనికున్న ఈ అభిప్రాయాలన్నిటితో నాకేం పేచీ లేదు. కాకుంటే 'పిటీ' ఏంవిటంటే ఇంగ్లీషు భాషకు 'ఆర్టికల్స్' ఉన్నాయనే సత్యం ఇవ్వాళ్టికీ బాబ్జీకి తెలీదు. దీనికి తార్కాణం అతను రాసే ప్రతివాక్యంవూను. మరో విచారకరమైన విషయం— బాబ్జీ భార్యకు పది సైకిల్ రిక్షాలున్నాయి. అవన్నీ అద్దెకిచ్చేవే. వాటి డ్రైవర్లు తరుచుగా సమ్మె చేస్తూ వుంటారు— రోజు అద్దెరేటు తగ్గించమని!

"అయ్యగారు రమ్మంటుంటే పోకేం సార్"— రెండుచేతుల్లోనూ పళ్ళేలూ, కప్పులూ పుచ్చుకుని అలవోకగా అప్పైమెళ్ల స్పీడులో నడిచే హోటల్ సర్వర్‌లా— రెండు చేతుల్తో 'ప్యాడ్'లు తీసికొస్తూ చెప్పేడు ఖాశిం. అతను మా 'క్లాస్ ఫోర్'. మాట్లాడే తీరులో మాత్రం క్లాస్—ఏ—వన్!

అంతే కాదు. అతను వేషభాషల్లో కూడా ఏ—వన్నె అతనెప్పుడూ టెర్లిన్ దుస్తులే ధరిస్తాడు. అతనిచేత యూనిఫారమ్ ధరింపజేసే ఆఫీసర్లు మా ఆఫీసులో లేరు. ఎప్పుడో ఏడాదికోసారి 'ఇన్‌స్పెక్షన్' అని వో తిరునాల జరుగుతుంది. ఆ సందర్భంలో మా ఆఫీసరు ఖాశింని పిల్చి, "చూడు ఖాశిం ఇవ్వాళ వొక్కరోజూ 'యూనిఫారమ్' వేసుకు రాగలవా?" అని అడుగుతాడు. అవును మా ఆఫీసరు ఇలాంటి వ్యవహారాల్లో చాలా మర్యాదస్తుడులెండి. "నాకేం అభ్యంతరం లేదు సార్ కాని వాటికి బటన్స్ ఇప్పించండి" అంటాడు ఖాశిం. అంతే. దాంతో ఆఫీసరుగారి మాటపడిపోతుంది. ఆ బటన్స్ స్టేషనరీ డిపార్ట్‌మెంట్‌లో వుండవు. ఇచ్చిన ఇత్తడి బటన్స్ ఏమై పోయినై అని అడగలేడు ఆఫీసరు!

ఖాశింకి డిపార్టుమెంటులో ఉండటమంటే గొప్ప కష్టం. అక్కడ ఇరుగ్గా, చీకటిగా వుంటుందతనికి. వరండాలో అయితే కావలసినంత గాలీ, వెలుతురూ. ఆఫీస్ పనిమీద వచ్చే 'విజిటర్స్ రూమ్' అక్కడే వుంది మరి!

ఒకసారి నేనిలాగే జోక్ చేశాను. అతను సీరియస్‌గా అన్నాడు. "ఏం గాలీ, వెలుతురూ సార్. అందరం పంచుకుంటే అది— ఎంతుంటుంది— నా వంతు రోజుకో పది". అవును పాపం వరండా ఇంకొంచెం విశాలం కావాలి. 'ధరలు పైపైకి ఎదుగుతున్న కొద్దీ యిలాంటి వరండాలు విశాలం కాక తప్పదు మరి'—అంటూ వుంటాడతను.

ప్యాడ్‌ని టేబుల్‌మీద విసిరేసిన శబ్దానికి ఉలిక్కిపడి లేచేను.

'ఛేంబర్స్'లోకి నడిచేను.

"రూల్స్ పాటించమని మీ కెన్నోసార్లు చెప్పాను. ఈ ఫారమ్

మీద పార్టీ సంతకంలో చాలా తేడా వుంది. మీరు దీన్నెలా 'పాస్' చేస్తున్నారో నాకర్థం కావటంలేదు. రేపేదన్నావస్తే నన్నిరికిద్దామనా? ఇలాంటివి నేను చూసుకుంటున్నాను కనుక, కటకటాలు చూసే అవసరం కలగటం లేదు. లేకపోతే సరాసరి శ్రీకృష్ణ జన్మస్థాన ప్రాప్తి. అ— " గుక్కతిప్పుకోకుండా చెప్పేశాడు.

ఆయన అంతేలెండి. ఎవరితో ఎలా మాట్లాడాలో ఆయనకు బాగా తెలుసు. నిజానికి కరిగిన కొవ్వుతోనూ, మైనంతోనూ ఆడు కోవటం చాలా బాగుంటుంది కదటండీ!

నేను కుర్చీలో కూర్చుని ఆయనవైపు చూసేను.

బట్టతల నిగనిగలాడుతోంది. నూనెతో కలిసిన చెమట కుడివైపు చెంపమీదికి నెమ్మదిగా జారుతోంది. ఆయన మొహమంతా కందిరీగలు కుట్టినట్టుంటుందసలు. నుదుట పైసా వెడల్పున కాలిన మచ్చ. పెదిమల్ని వెనక్కూ ముందుకూ ఆడిస్తూ ఎగరేస్తూవుండటం ఆయనకదో వింత అలవాటు. నిమిషానికి పదిసార్లన్నా అవలా కదుల్తూ వుంటాయి. ఆయన్ని ఆ భంగిమలో చూస్తుంటే అప్పుడే ఎవడ్నో పొడిసేసొచ్చిన హంతకుణ్ణి చూస్తున్నట్లుంటుంది.

"మాట్లాడరేంవండీ— " మొహంకండలు చించుకోవడమంటే ఇదే కాబోలు! "మీరు మాట్లాడటం పూర్తయిందో లేదోనని...." ఇది నా నోట్లో మాట.

"పార్టీ సంతకాన్ని మన బ్రాంచి స్టాఫ్ 'ఐడెంటిఫై' చేశాడండి. అంతేగాక, సంతకంలో తేడా వున్నది- యింటిపేరు రాయడంలోనే. యిదివరకేంవో అతను "మట్టిగ రాజారావు" అని పూర్తిగా రాశాడు. యిప్పుడు "యం. రాజారావు" అని సంతకం చేశాడు. పైగా ఆ 'యం.' అనే అక్షరం సరిపోతోంది. అందుకని...."

నా వివరణని మధ్యలోనే త్రుంచేస్తూ "నా నా నో. బిల్ తిప్పివంపించండి" అన్నాడు.

"అది అన్యాయం సార్" టక్కున వచ్చేసింది మాట.

"ఆ.... అన్యాయమా? కళ్ళు పెద్దవి చేసి గుర్రిచ్చి గుర్రిచ్చి చూస్తూ అడిగేడు, "మీ వుద్దేశ్య మేమిటి? నువ్వొక్కడివేనటయ్యా న్యాయపాలకుడివి. నీతులు చెప్పక చెప్పింది చెయ్యండి" ఫైల్లో ఏదో గీకి నాముందు విసిరేడు.

నిజమే కొంతమందికి నీతులుచెప్పి లాభంలేదు. గోతులు తీసి, "జు....జ్జు....జ్జు...." అంటూ లాలనగా పిల్చి వాటిల్లో తోసి; పైన వో బండెడు మట్టి పోసి పాతేస్తేనేగానీ ఇంచక్కా బుద్ధిరాదు. నాకు ఆయన సంగతంతా తెలుసు. బిల్ తాలూకు పెద్దమనిషి ఎవడో, వాడు ఆయన దర్శనం చేసుకోకపోతే చాలా చిరాకు మా మేనేజరుకి. అలాంటి పెద్దమనిషి వచ్చి పక్కన కూర్చుంటే బిల్‌లో చాలా లోపాలున్నట్లూ, అయినా తను వాటన్నింటినీ తోసిరాజంటూ బిల్ పాస్‌చేసి మహోపకారం చేస్తూనట్టూ— కంచుకంఠంతో 'సొన' మొదలెట్టాడు మేనేజరు. అవతలివాడు వీరి మహోదారబుద్ధికి ఎంతగానో సంతోషపడిపోయి, వీరికి జీవితాంతం ఋణగ్రస్తుడై పోయినట్లు మొహం పెట్టి మొహమాటపడిపోతుంటే వీరికీ, వీరి "అహం"కీ బోలెడంత సంతృప్తి. ఆనక వీరు వారిలో "తిరుపతి ప్రయాణం పెట్టుకున్నామండీ—ఫామిలీతో. కారుకోసం చూస్తున్నాను...."అంటూ నసుగుతారు. వారు కుక్కిన పేనులా లోలోపల ఏడుస్తూ, పైకి భోళాగా నవ్వుతూ, "అంత ఇబ్బందెందుకు సార్.... మన కారుందిగదా — నేను పంపుతాను. ఎప్పుడో చెప్పండి" అని ఆప్యాయంగా అడుగుతారు. వీరి ముఖం, మబ్బు విడిచిన చంద్రుడిలా మారుతుంది.

నేను యింకా తనవైపు అలా చూస్తూ కూర్చుని వుండటంతో అసహనంగా ఫైలు నాముందుకు నెట్టి "తీసుకువెళ్ళండి" అన్నాడు.

ఫైలుని పక్కకి పెట్టి "థాంక్యూ" అంటూ కుర్చీలో నుంచీ లేచాన్నేను. దాన్ని ప్యూన్ ద్వారా పంపమని చెప్పక చెప్పిన నా చర్యకు విస్తుపోయి, ఆ క్షణంలో మరో పదిసార్లు ఎక్కువగా పెదిమలు కదిలించుకున్నాడు మేనేజరు.

"పిల్చింది ఎందుకో తెలిసిందా ?" సీట్లో కూస్తుంటే అడిగాడు బాస్జి. భార్య సంతకం వున్న "విత్ డ్రాయిల్" ఫారమ్ పూర్తి చేస్తున్నా డతను.

సమాధానం చెప్పాలనిపించలేదు. నేను నా సీట్లో కూర్చున్నాను.

క్షణాల తరువాత నావైపు గుర్రిచ్చి గుర్రిచ్చి చూస్తూ మళ్ళీ అడిగేడు, "ఎందుకోయ్ పిల్చింది?"

"నోరుమూసుకుంటే తెలుస్తుంది" అనబోయేను కానీ, అనలేదు. నవ్వొచ్చింది. సన్నగా నవ్వేను.— అదే సమాధానమన్నట్టు. అతను ముఖం ముడుచుకున్నాడు.

"ఏవిటండీ—సత్యంగారూ—ఈ బ్రహ్మరాత ?"

(వచ్చావా మహాతల్లీ, రా. నువ్వూ ఇదే వరస— ముస ముస, పెట పెట— పుట్టి మునిగిపోయినట్టు. పువ్వులాంటి ఆడపిల్లవు గదా —అందునా పచ్చగన్నేరు పువ్వులాంటి పిల్లవే— ఇంచక్కా నవ్వుతూ తుళ్ళుతూ ప్రసన్నంగా, ప్రబంధ నాయికలా వుండరాదూ. ఎందుకిలా చిరచిరలాడుతూ, రుసరుసలాడుతూ వుంటావ్ ? బ్రహ్మరాతే కారణ మేంవో ! వయసొచ్చినా పెళ్ళికాకపోవటం వల్ల ఏదో అసంతృప్తి ఎదిగి ఎదిగి ఇలా చిరచిరలాడేట్టు చేస్తుందిట. అంతేనా, శకుంతలా నీ అవస్థ ?)

"ఏవిటలా చూస్తారు?"

కళవళ పడ్డాను. తేరుకుని, "బ్రహ్మ రాత మారదు కదండీ" అన్నాను సన్నగా నవ్వుతూ.

శకుంతల మొహం చిట్లించుకుంది. లోలోపల మెటికలు కూడా విరుచుకుని వుండివుంటుంది. "వేదాంతం చాల్లెండి" అని పది వంకరలు తిరిగి, "ఇన్ని కొట్టివేతలూ, బాణం మార్కులూ, సున్నాలూ, ఇంటూ గుర్తులూనా? నాకూ 'వర్క్ లోడ్' వుంది. మీ ఉత్తరం ఒకటొచ్చిందంటే ఆ వేళ నాలుగు 'డిస్పోజల్స్' పడిపోతాయ్ నాకు."

"శకుంతల గారూ— మీరే చెప్పండి. సజ్జలు తిని జొన్నలు విసర్జించే కోళ్ళుంటయ్యా?"

శకుంతల చాలా ఆతృతగా ముఖకవళికలు మార్చింది. 'అంటే' అని రెట్టించింది.

"చిన్నప్పట్నుంచీ అలవాటయిన రాత. ఇప్పుడు మారుతుందా"

"మారదుగానీ— ఈ వాక్యం ఎక్కడ తగలెయ్యాలో చెప్పండి" అని "తల పగిలి పోతోంది" అంటూ సుతారంగా కణతలు నొక్కుకుంది.

నేను ఆమె వైపు పరీక్షగా చూస్తున్నాను. ఎర్ర వాయిల్ చీర, నల్ల జాకెట్‌లో ఆమె ఆకర్షవంతంగా వుంది. ఒక ప్రక్కకి తిరిగి నుంచుని వుండటం వల్లన యవ్వనం ప్రకృతిలో కలుస్తోంది.

'సత్యంగారూ—' ఆమె కొట్టినట్టు అరిచింది, పైట సరిచేసుకుంటూ.

ఉలిక్కిపడ్డాను. 'మేనేజరు నెత్తిన తగలెయ్యండి.' తపీమని సమాధానం చెప్పేను. శకుంతల కనీసం తనలోతానన్నా నవ్వుకుని వుంటే బాగుండేది. ఉహూ— ఏ భావమూ వ్యక్తంకాని ముఖంతో విసవిసా వెళ్ళిపోయింది.

జోక్‌ని ఆనందించటం తెలియని మనుషులు !

నేను అలాగే చూస్తూ కూర్చున్నాను. 'ఉద్యోగినులు — పెళ్ళి కాని యువతులు' 'సమస్యలు - సమాజం' నా బుర్రలో తిరగసాగేయి.

"నేను మీకు చాలాసార్లు చెప్పేను. నా వ్యవహారాల్లో తల దూర్చవద్దని" - రంగనాథం వచ్చేడు.

రంగనాథం వచ్చాడంటే - మే నెలలో (ప్రత్యేకించి బందర్లో) తుఫానొచ్చినట్టు. రంగనాథం వచ్చాడంటే - బాగా కాలిన పెనం మీద నీళ్ళు చల్లినట్టు. రంగనాథం వచ్చాడంటే - తెలుగు సినిమాలో నేపథ్య సంగీతం వచ్చినట్టు.

"నేను పని చేయటం లేదని రిపోర్టు చేస్తావా? నిన్నగాక మొన్నొచ్చావ్ - ఏమిటి నీ ధైర్యం? అసలు నేనెందుకు పని చెయ్యాలీ అని అడుగుతున్నానయ్యా. చెప్పు. సమాధానం చెప్ప వయ్యా. ఇరవైనాలుగేళ్ళ సర్వీసున్న 'సీనియర్ మోస్ట్'ని నాకా తుక్కు సీటు అంటకట్టాడా? అందులోనూ ఆ సీటు కూడికలూ, తీసివేతలూ వేయటానికి ఫష్టుఫారమ్ పాణ్ణి చూసుకుంటే పోయేదిగా. ఛీ. ఛీ. ఏం మేనేజ్‌మెంటు? వీళ్ళకి పని చెయ్యమని ఎవరయ్యా చెప్పింది? స్టేట్‌మెంటుకు ఫిగర్స్ ఇవ్వలేదనేగా నీ ఫిర్యాదు. అసలీ నెల ఇవ్వనయ్యా. ఆ. అంతే.... పోయి డైరెక్టరుతోనో, మేనేజరుతోనో చెప్పుకో. ఏం చేస్తారో నేనూ చూస్తాను...." దుమ్ము లేపుకుంటూ వెళ్ళిపోయాడు రంగనాథం.

"అసలీ నెల ఇవ్వనయ్యా" అన్న అతని మాటలు గుర్తు కొచ్చేయి. ఇవ్వనుగాక ఇవ్వను - అసవయ్యా స్వామీ మధ్య నాదేం పోయింది. పైవాడు పిల్చి అడిగినప్పుడల్లా నీ ఘనతే చెప్తూ వుంటాను.

రంగనాథం ఉద్యోగుల్లోని అసంతృప్తికి నిట్టనిలువు నిదర్శనం. అతను ఆఫీస్ టైమ్‌లో ఎక్కువ భాగం అగాథాక్రిష్టి, ఎరల్‌స్టాన్లీ గార్డ్‌నర్ లని చదువుకుంటూ వుంటాడు. మిగిలిన కొద్ది కాలాన్నీ చక్కగా 'క్యాంటీన్'లో గడుపుతాడు. అది ఇతనికి రీడింగ్ రూమ్‌గా ఉపయోగపడుతుంది. దినపత్రిక తీసుకుపోయి దాన్లోని ఏ అక్షరమూ వదలకుండా చదివే కార్యక్రమం అక్కడ సాగిస్తాడు రంగనాథం. అతనికి 'జూనియర్స్'ని చూస్తే ఆవకాయ కలిపిన చేతులు మండినట్లు ఒక ఉేమంట! అంచేత ఆయన మొహం ఎప్పుడూ ఎర్రి కిరసనాయిల్ బుడ్డీలాగే వుంటుంది.

రామ్మూర్తి— ట్యూషన్ మాష్టర్ రామ్మూర్తి!

బాబ్జీ— భార్య వ్యాపారానికి ప్రత్యేకాధికారి బాబ్జీ!

ఖాశిం— ఆఫీసు యిరుగ్గా తోచే ఖాశిం!

మేనేజర్— పెదిమలు కదిలించే రూల్‌ని ఖచ్చితంగా పాటించే మేనేజరు!

శకుంతల— యవ్వనాన్ని ప్రకృతిలో కలుపుతున్న శకుంతల!

రంగనాథం— 'ఫ్రస్ట్రేటెడ్' సీనియర్ మోస్ట్ రంగనాథం!

ఒక్క మనిషీ నవ్వడేం?

ఒక్క మొహంవూ మందారంలా వికసించదేం?

బ్రతుకు బరువులూ, బాధ్యతలూ వీళ్ళందర్నీ యంత్రాలుగా, నిరాశకు నిలయాలుగా మార్చివేసినయ్యా? అయితే ఆ బాధలూ, వ్యథలూ వీళ్ళకొక్కళ్ళకేనా వుంది?

సాయంత్రం దాకా ఆలోచిస్తూనే వున్నాను వీళ్ళందర్ని గురించీ.

బెల్ మోగింది. గేటుదాటి యివతలకి వచ్చేను.

బారులు తీర్చి వచ్చేస్తున్న వీర సైనికులు ఎదురయ్యారు.

అప్పుడే విరిసిన పువ్వుల్లాంటి వాళ్ళు, అప్పుడే కురిసిన వడగళ్ళలాంటివాళ్ళు, అప్పుడే పులుగడిగిన ముత్యాల్లాంటివాళ్ళు అంతా పదేళ్ళ లోపు పిల్లలు. అందరివీ ఒకటే రకం దుస్తులు, అందరి చేతుల్లోనూ ఒకేరకం పెట్టెలు, అందరి మొహాల్లోనూ ఆనందపు పారిజాతాలు, అందరి కళ్ళల్లోనూ అమాయకత్వపు కలువ రేకులు.

నేను వివశుణ్ణయ్యాను. నా మనస్సంతా ఏదో హాయి నింపుకుంది. మంచు పల్లకీలో వూరేగుతున్నట్లనిపించింది. భావిభారత పౌరులు ! రాబోయే వీళ్ళతరం కూడా వీళ్ళున్నంత అందంగా, ఆహ్లాదకరంగా వుండాలి !

—ఆ రోజు రాత్రి,

చాలా పొద్దుపోయే వరకూ నాకు నిద్ర పట్టలేదు. కళాకాంతీ లేని ఆఫీసు వాతావరణం, మొహాల్లో ఏకోశానా నవ్వులేని ముసురు మనుషులు, హాసమూ, దరహాసమూ, ఏ వికాసమూ ఎరుగని మనసులు వాళ్ళందరి మునమునలు, పెటపెటలు – యివన్నీ తలపుకు రాసాగేయి. ఆ తర్వాత అప్పుడే విరిసిన పూలు, అప్పుడే కురిసిన వడగళ్ళు, అప్పుడే పులుగడిగిన ముత్యాలు కళ్ళ ముందు మెదిలేయి. బారులుతీరి వచ్చేస్తున్న బాలవీరులే మదిలో నిలిచేరు.

మర్నాడు,

ఆఫీసుకు వెళ్ళేనన్నమాటే గాని మనసు మనసులో లేదు. పని చేయ మనస్కరించటంలేదు.

పన్నెండయింది.

రామ్మూర్తి డైరెక్టరు గదిలోనుంచీ బయటికొచ్చి, అందరి

వైపూ అదోలా చూసి తన సీట్లోకెళ్ళి కూర్చున్నాడు. అతని వెనగ్గా ఖాశిం వచ్చి, "రామ్మూర్తిగారికి ప్రమోషన్ వచ్చిం"దంటూ వో ప్రకటన చేశాడు.

నేను చాలా హడావుడిగా లేచి గబగబా రామ్మూర్తి దగ్గరసా వెళ్ళి అభినందించేను. "చాలా సంతోషంగా వుంది రామ్మూర్తిగారూ. కంగ్రాట్యులేషన్స్" అని నిండుగా నవ్వుతూ చేయందించేను.

అతను నా వైపు నిర్వేదంగా చూసేడు. "దట్సాల్ రైట్" అని ముభావంగా అని ఏదో ఫైల్లో తల దూర్చేడు.

నేను గతుక్కుమన్నాను. రామ్మూర్తిని చూస్తుంటే మాచెడ్డ కోపం వచ్చింది. "వోరి నీ మొహం మండ. ప్రమోషన్ వచ్చిందన్నా నీ మొహంలో కళ రాలేదు. ఇదేం మనిషివిరా !"

వచ్చి నా సీట్లో కూర్చున్నాను. అప్పటికి తెలిసింది నాకు. ఈ వార్త ఎవ్వరిలోనూ ఏ విధమైన ఉత్సాహాన్నీ సంతోషాన్నీ సంచలనాన్నీ కలిగించలేదనీ, ఎక్కడివాళ్ళక్కడ కూర్చుని మామూలుగా మొహాలు మాడబెట్టుకునే వున్నారనీను. ఈ జనం తరహాకీ, ఉ[redacted]వానికీ ఆశ్చర్యం, బాధ కలిగేయి నాకు.

ఆ వేళ సాయంత్రమే రామ్మూర్తిని అభినందిస్తూ పార్టీ జరిగింది. ఏదో 'తప్పనిసరి తద్దినం' పెట్టినట్టు సాగిపోయింది - తతంగామంతా. మా మేనేజరు, డైరెక్టరు, మరో ఆఫీసరూ మాట్లాడేరు. మాట్లాడేరనేకంటే పెదవులు కదిలించి మొహాన్నా నవ్వును పులుముకున్నారంటే బాగుంటుంది. మా ఉద్యోగి బృందం మాత్రం పల్లేరు కాయల్లా మొహాలెట్టుకుని కూర్చుండిపోయారు.

ఈ సంఘటనతో మనసంతా వికలమై పోయింది నాకు.

మరో వారానికి రంగనాథంకి బదిలీ అయింది. అతని వీడ్కోలు

సమావేశం కూడా నన్నో వెర్రి బాగులవాడిగా నిరూపించింది. కారణం— ఆవేళ నేను మావాళ్లందరినీ నవ్వించి తీరాలని నిశ్చయించుకుని విఫలుణ్ణి కావటమే !

వీటన్నిటికంటే నన్ను పిచ్చెక్కించేసిన సంఘటన గురించి చెప్తాను.

రంగనాధంకు బదులుగా గుంటూరు నుంచీ చలపతి వచ్చేడు. అతనికి సీటూ పనిగురించి తెలియజేసే బాధ్యత నామీద పడింది. రెండు రోజులు అతను నాపక్కనే కూర్చున్నాడు. నేను ఎన్నెన్ని విషయాలో మాట్లాడేవాణ్ణి. ప్రసంగ వశాత్తూ నా వ్యక్తిగత చరిత్ర కొంత చెప్పేను. అతని గురించి విచారించేను. కాని చలపతికి మాత్రం — "ఆ—వూ"లు తప్ప సమాధానాలుండేవి కావు. కొత్త గదా కొంచెం "రిజర్వ్ డ్"గా వుంటున్నాడనుకున్నాను.

మరో పది రోజులు గడిచేయి.

వో రోజు ఆఫీసుకు రాగానే— ఆనాడు సంచలనాన్ని కలిగించిన —దినపత్రికలోని విశేషాలు చలపతితో ముచ్చటించ సాగేను. నేను రెండు క్షణాలు మాట్లాడిన తర్వాత అతనన్నాడు. "సత్యంగారూ! నాకు ఇలా మాట్లాడుతూ వుండటం ఇష్టంలేదు".

నేను విస్తుపోయేను. మరేఁవీ మాట్లాడలేకపోయాను.

అంతే—

ఆనాటి నుంచీ నాలో తీవ్రమైన ఆలోచన బయల్దేరింది. నా జీవితం ఇరుకై పోతున్నట్లూ, నా బ్రతుకు గూటిలో చీకటి పరచుకున్నట్టు, నా ఆయుఃప్రమాణం తగ్గిపోతున్నట్టు! బాధ ఎక్కువ కాసాగింది.

ఆ సాయంత్రం ఇంటినుంచీ ఉత్తరం వచ్చింది నాకు.

అమ్మకు దగ్గుతెరలో రక్తం పడుతున్నట్టూ, తమ్ముడు కాలేజీకి వెళ్లటం లేదనీ, చెల్లెలు శాంతకు మాట్లాడిన సంబంధం వాళ్ళ అమ్మ జబ్బు తెలుసుకుని — తమకీ సంబంధం వద్దన్నారనీను. చివర్లో నాన్న వ్రాసేడు — "నువ్వు ఎప్పుడు రమ్మంటావో రాస్తే — అందరం వస్తాము. త్వరలో సమాధానం రాయగలవు" అని.

రెండు రోజుల తర్వాత నాన్న కోరిక ప్రకారం ఆయనకు సమాధానం రాసేను.

— నేనిప్పుడు ఒక ఇంగ్లీష్‌మీడియం ప్రైమరీ స్కూల్లో టీచర్ని !

నా ముందు రోజల్లా నవరత్నాలు రాశిగా రాలుతూ వుంటాయి !

*  *  *